క్లుప్తంగా

విలేకరిపై టీడీపీ నాయకుడి దాడిని ఖండించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

పాలకోడేరు: పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి విలేఖరి మల్వాడ రామారావుపై గ్రామ టీడీపీ అధ్యక్షుడు దాడి చేసి చంపేస్తానని బెదిరించిన గుల్ల వేణుగోపాల్ నాయుడుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పాలకోడేరు మండలం విలేకరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ నడింపల్లి భారతీవిజయలక్ష్మికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ విలేకరులు మాట్లాడుతూ రోజురోజుకూ పత్రికా స్వేచ్ఛను కాలరాస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జర్నలిస్టులపై దాడులు ఈ కాలంలో పెరిగాయని వీటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో విలేకరులు విజయ్, సూర్య, ప్రసాద్, నరేష్, అరుణ్, సురేష్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం


త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: మండలంలోని త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక భీమవరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం రాయకుదురు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాల ప్రచారం నిర్వహించారు. శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవ జ్ఞానాన్ని తెలియజేయడం అని అర్థం అని వివరించారు. ఈ కార్యక్రమంలో భీమవరం కమిటీ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, వెంకటలక్ష్మి, భవాని, సుజాత, హనుమంతరావు, నరసింహ, సత్యనారాయణ, నాగేశ్వరరావు, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్‌లో విష్ణు విద్యార్థి ప్రతిభ


బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులు విద్యతోపాటు దేహ దారుఢ్యం, క్రీడల్లో రాణించాలని విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ఎం.వేణు అన్నారు. ఇటీవల చీరాలలో నిర్వహించిన జెఎన్‌టీయూ కె సెంట్రల్ జోన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో కళాశాల విద్యార్థి వై.భార్గవ సాయి కేశవ మాలీ ప్రతిభ కనబర్చి రెండో స్థానంలో నిలిచాడని అన్నారు. ఈ సందర్భంగా విజేతను సొసైటీ చైర్మన్ కె.విష్ణురాజు, కళాశాల పీడీ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీలక్ష్మి తదితరులు అభినందించారు.

పేకాట స్థావరంపై దాడి

ఆకివీడు: స్థానిక శ్రీరామపురంలో మంగళవారం పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2700 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హనుమంతు నాగరాజు చెప్పారు. వారిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరుస్తున్నామన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం


విద్యార్థులకు సైకిల్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం లయన్స్ క్లబ్ చేసిన కార్యక్రమాలు అభినందనీయమని లయన్స్ గ్లోబల్ సర్వీస్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణంరాజు అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మల ఎంటర్‌ప్రైజెస్ సురేంద్ర, లక్ష్మి ఆక్వా కేర్ అరవ ప్రసాద్ ఆర్థిక సౌజన్యంతో ముగ్గురు విద్యార్థులకు ఉచితంగా సైకిల్స్ పంపిణీ చేశారు. భీమవరం లయన్స్ క్లబ్ 2024- 25కిగాను రూ.24.50 లక్షలు సేవా కార్యక్రమాలను నిర్వర్తించడం ఎంతో గొప్ప విషయమన్నారు. కె.వేణుబాబు, పేరిచర్ల మూర్తి రాజు, గోపిశెట్టి మురళీ కృష్ణారావు, బొండాడ కుమార వెంకటరత్నం, నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, వబిలిశెట్టి శెట్టి కనకరాజు పాల్గొన్నారు

రేషన్ పంపిణీ సక్రమంగా ఉండాలి

పోడూరు: రేషన్ పంపిణీ సక్రమంగా ఉండాలని తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ ఆదేశించారు. పోడూరులో 9వ నెంబరు రేషన్ దుకాణాన్ని, ఎండీయూ 11ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పచ్చని పొలాల్లో ఆక్వా చిచ్చు

- చెరువులకు అడ్డగోలు అనుమతులు
- రోడ్లు, కాలువగట్లు, పంటబోదెలను ఆక్రమించి తవ్వకాలు
- ప్రజలకు ప్రాణ సంకటంగా మారిన ఆక్వా చెరువులు
- తాగునీటికి అల్లాడుతున్న ప్రజలు


కోలమూరులో రోడ్డుపై గట్టు వేసి తవ్వుతున్న ఆక్వా చెరువులు


కోలమూరులో పంటబోదెను పూడ్చి వేసిన దృశ్యం

ఉండి: ఈ పాపం ఎవరిది.. పచ్చని పొలాలు గల ఉండి నియోజకవర్గంలో ఆక్వా చెరువుల తవ్వకాలు చేసిన నాటి నుంచి పర్యావరణంలో ఎన్నో మార్పులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవైపు అధికారుల ధన దాహం, మరోవైపు చెరువుల యజమానుల ఆక్రమణల పర్వంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. చెరువుల తవ్వకాల్లో నిబంధనలను పూర్తి స్థాయిలో గాలికొదిలేసిన అధికారులు కనీసం క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండానే కార్యాలయాలకు పరిమితమై అనుమతులిచ్చేస్తున్నారు. ప్రభుత్వ భూములను చెరువు తవ్వకాల్లో కలిపేసుకుంటున్నారంటే ఉండి నియోజకవర్గంలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. చెరువు తవ్వకంలో మూడు మీటర్లు వదిలిపెట్టి గట్లు వేసుకోవాలి. సీఫేజ్ ఉండాలి ఇలా అనేక నిబంధనలు ఉన్నా గాని వాటిని చెరువు యజమానులు గాని అనుమతులిచ్చే అధికారులు గాని పట్టించుకున్న పాపానపోవడం లేదు.

ఆక్వాజోన్ పేరిట మరిన్ని దారుణాలు

ఉండి ఆక్వాజోన్‌లో ఉన్న కారణంగా ఇతర శాఖల అనుమతులు అసరం లేదని తామే అనుమతులిచ్చేస్తామని ఎవరికీ కనీసం సమాచారం చెప్పనవసరం లేదని ఇటీవల ఉండిలో జరిగిన ఓ చెరువు తవ్వకం వివాదంలో మత్స్యశాఖ అధికారి చేసిన వ్యాఖ్యలివి. చెరువు తవ్వకాల కోసం రెవెన్యూ, ఇరిగేషన్, డ్రెయినేజ్, మత్స్యశాఖ, భూగర్భ జలశాఖ, విద్యుత్‌శాఖ ఇలా తదితర శాఖల అనుమతులు అవసరం కాగా వాటిని ఇప్పుడు ఆక్వాజోన్ పేరిట తుంగలో తొక్కి అన్నీ తామే అన్నట్లు మత్స్యశాఖ అధికారులు అనుమతులిచ్చేస్తున్నారు. రైతులు, స్థానికుల నిరసనలను కూడా లెక్క చేయకుండా చెరువుల తవ్వకం చేసుకోవచ్చని అధికారే అన్నీ తానై నడిపిస్తున్నాడు. కూటమి నాయకులు, కార్యకర్తలైతే వారికి అనుమతులు లేకపోయినా ఉన్నాయంటూ అధికారి వత్తాసు పలుకుతున్నారు. అంతే కాకుండా ఆయనే దగ్గరుండి చెరువులు తవ్విస్తారనే ఆరోపణలు కూడా అయనపై ఉన్నాయి. దీనిపై మండిపడిన ఏఈ స్థాయిలోని ఓ శాఖాధికారి ఇటీవల ఉండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారంటే ఆక్వాజోన్ ఆగడాలను అర్థం చేసుకోవచ్చు.

తాగునీటికి అల్లాడిపోతున్నాం



కొందరి స్వార్థం కోసం నియోజకవర్గ ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుంది. అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేయకపోవడంతో వ్యర్థాలను పంట కాలువల్లోకి విడిచి పెడుతున్నారు. ఆ నీటిని తాగిన ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రస్తుతం ఎక్కడా సరైన తాగునీరు దొరకడం లేదు.

– దానం విద్యాసాగర్, న్యాయవాది, పాములపర్రు

దీనికి ఎవరు బాధ్యులు



ప్రకటనలు చేసి ఊరుకోకుండా పని చేయాలి. పంట కాలువల్లోకి ఆక్వా చెరువుల వ్యర్థాలు విడిచిపెట్టినా, నిబంధనలు పాటించకపోయినా చర్యలు తప్పవని ప్రజా ప్రతినిధులు, వారిని మించి అధికారులు ప్రకనటలు గుప్పిస్తున్నారు. కానీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఎవరి వల్ల నిర్లక్ష్యం జరుగుతుందో ఎవరు దీనికి భాధ్యులో గుర్తించి చర్యలు తీసుకోవాలి.

– వెలపగల్లి టోనీ, యండగండి

తాగునీటికి అల్లాడిపోతున్నారు.

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తాగునీటికి ప్రజలు అల్లాడిపోతున్నారు. కాలువలు, పంటబోదెలు ఇలా అన్నింటా స్వచ్ఛమైన నీరు ప్రవహించే ఉండి నియోజకవర్గంలో ఇప్పుడు తాగునీరు విషంలా మారిపోయింది. ప్రజలు తాగునీటి కొనుగోలుకు ప్రతి రోజూ రూ.20 నుండి రూ.40 ఖర్చు చేయాల్సిన దుస్థితి ఉండిలో తలెత్తింది. దీనికి కారణం అధికారులే. ఎందుకంటే ఆక్వా చెరువుల తవ్వకాల్లో నిబంధనలు పూర్తిగా గాలికొదిలేశారు. ఇటీవల నియోజకవర్గ ఎమ్మెల్యే కూడా ఆక్వా వ్యర్థాలు పంట కాలువల్లోకి విడిచిపెడితే చూస్తూ ఊరుకోను అంటూ పెద్ద ప్రకటన చేశారు. ఎంత వరకు అమలవుతుందో వేచి చూడాలి మరి.

బర్డ్‌ఫ్లూతో చిరు వ్యాపారులు కుదేలు

ఆకివీడు: బర్డ్‌ఫ్లూతో కోళ్ల అమ్మకాలు నిలుపుదల చేయడంతో రోడ్ల వెంబడి ఉండే చికెన్ సెంటర్లు, పలావ్ బళ్లు, చికెన్ ఫ్రై వంటి పలు రకాల చికెన్ వంటకాలను అమ్మే చిరు వ్యాపారులు ఉపాధిని కోల్పోయి కుదేలవుతున్నారు. చికెన్ షాపులు మూతపడటంతో చికెన్ అమ్మేవారు ఉపాధిని కోల్పోయామని, చికెన్ అమ్మకాలతోనే తమ జీవనం గడుస్తుందని వారు వాపోతున్నారు. మూడు నెలలు అమ్మకాలను నిలుపుదల చేయడంతో తాము దిక్కుతోచని స్థితిలో ఉన్నామని, ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం చిరు వ్యాపారులకు ఆసరాగా ఉండాలని పలువురు వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కోడి పందేలపై దాడి

ఉండి: మండలంలోని మహదేవపట్నంలో నిర్వహిస్తున్న కోడి పందేలపై ఎస్సై ఎండీ నసీరుల్లా ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2100 నగదు, రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

డైరీ ఆవిష్కరణ

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల రాష్ట్ర సంఘం డైరీని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జకరయ్య నర్సాపురం డివిజన్ అధ్యక్షుడు కెవి సత్యనారాయణ, తాడేపల్లిగూడెం డివిజన్ సెక్రెటరీ ముత్యాలరావు, అత్తిలి మండల అధ్యక్షుడు బాబులు, రామకృష్ణ, శ్రీనివాసు, కే దుర్గారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ


అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ రవీంద్ర, సీడీపీఓ వాణీ విజయరత్నం

ఆకివీడు: అంగన్‌వాడీ కార్యకర్తలు తమ బోధనా సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం మంగళవారం స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర, సీడీపీఓ వాణీ విజయరత్నం మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తల్లో బోధనా సామర్థ్యం పెంపొందించేందుకు శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. కార్యకర్తలు ఇప్పటి వరకూ కేంద్రాల్లో చిన్నారుల పోషణా బాధ్యతలను నిర్వహించేవారన్నారు. ఇకపై బోధన చేపట్టేందుకు శిక్షణా తరగతులు ఉపయోగపడతాయని చెప్పారు. 120 రోజుల పాటు శిక్షణ ఇచ్చి ధృవపత్రం అందజేస్తారని చెప్పారు. వచ్చే ఏడాది అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్స్‌గా మార్చేందుకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలను స్కూళ్లలో కలిపి వేశారన్నారు. బోధనలో మెళకువలు నేర్చి, అంగన్‌వాడీ కేంద్రాలను ఎల్‌కేజీ, యూకేజీగా పాఠశాలల్లో కలుపుతారన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు అదే పాఠశాలలో విద్యార్థులకు బోధన అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ముత్యాల వెంకటస్వామి, డీపీఈఓలు పి.ముకుందరావు, ఎండీ ఇస్మాయిల్, బి.రాంబాబు, సూపర్‌వైజర్లు రత్నకుమారి, కేబీఎస్ లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జనగణనతో పాటు కులగణన నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

భీమవరం: రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన నిర్వహించి వెనుక బడిన, అణగారిన కులాల జనాభా ప్రాతిపదికన ఆయా కులాల అభివృద్ధికి సంక్షేమానికి నిధులు, రిజర్వేషన్లు కల్పించి సామాజిక న్యాయం చేకూర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ జిల్లా సమితి సమావేశం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళింగ లక్ష్మణరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కోనాల భీమారావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలపై కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇస్తామన్న హామీ నెరవేర్చాలని కోరుతూ సీపీఐ చేపట్టిన ఇళ్ల స్థలాలు అర్జీలు నింపే కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహించి మార్చి 15న జిల్లా కలెక్టర్‌కు ఇళ్ల స్థలాల అర్జీలు అందజేస్తామన్నారు. ఇళ్ల స్థలాల సమస్య తీవ్రంగా ఉందని త్వరితంగా పేదల ఇళ్ల స్థలాలు సమస్య పరిష్కరించాలని కోనాల కోరారు. మార్చి 23న భగత్ సింగ్ వర్థంతి నుంచి ఏప్రియల్ 14న అంబేడ్కర్ జయంతి వరకు రాజ్యాంగం, లౌకిక వాదం, ప్రజాస్వామ్య పరిరక్షణకు, సామాజిక న్యాయం కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ ఇళ్ల స్థలాలపై కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలా పేదల పక్షాన పోరాడాలని, అప్పట్లో నిర్మించిన టిడ్కో ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని వీటి పంపిణీపై పేదల తరపున నిలబడాలని సూచించారు. రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, బొద్దాని నాగరాజు, నెక్కంటి క్రాంతి కుమార్, సికిలే పుష్పకుమారి, నెక్కంటి జగదాంబ, సనపల శ్రీనివాసరావు, మల్లుల శ్రీనివాసరావు, కోన గొల్లయ్య, నామన వెంకటేశ్వరరావు, వైవీ ఆనంద్, జోషి, తిరుమాని కామేశ్వరరావు, ఎం.లక్ష్మీపతి, బొద్దాని కిషోర్ పాల్గొన్నారు.


ప్రకృతి రక్షణకు గుడ్డ సంచులు మేలు


భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్‌లో గుడ్డ సంచులను పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: ప్లాస్టిక్ కవర్లు వద్దు, గుడ్డ సంచులే ముద్దు అని ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ ని నివారించాలని రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ చక్రవర్తి, భీమవరం మున్సిపల్ ఇంజనీర్ త్రినాథ్ అన్నారు. భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్‌లో పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నివారించపోతే మానవమనుగడకే ముప్పు వాటిల్లుతుందన్నారు. ఇంటినుంచి బయటకు వచ్చేటప్పుడు కచ్చితంగా గుడ్డసంచి వెంట తెచ్చుకోవాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు మాట్లాడుతూ ప్రకృతి రక్షణకు గుడ్డ సంచులు మేలని, ప్రతిఒక్కరు ఒక్క మొక్కనైనా నాటాలన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం గన్నాబత్తుల శ్రీనివాస్ సహకారంతో 300 మంది ప్రయాణికులకు గుడ్డ సంచులను అందజేశారు.

సీసీ రోడ్డు ఉన్నా.. డ్రైయినేజీ సున్నా


కోళ్లపర్రు ప్రధాన రహదారిలో డ్రైయినేజీ సౌకర్యం లేక రోడ్డుపై పారుతున్న మురుగునీరు


కోళ్లపర్రులో డ్రైయినేజీ సౌకర్యం లేని సీసీ రోడ్డు

- రోడ్లపైనే మురుగునీరు తాండవం
- కోళ్లపర్రు మేజర్ పంచాయతీలో దుస్థితి ..

ఆకివీడు: మండలంలో మేజర్ పంచాయతీగా ఉన్న కోళ్లపర్రు గ్రామంలో కొన్ని వీధుల్లో సీసీ రోడ్లు ఉన్నప్పటికీ పక్కా డ్రెయిన్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మేజర్ పంచాయతీగా గత 20 ఏళ్లుగా గుర్తింపు పొందిన కోళ్లపర్రు పంచాయతీ డ్రెయినేజీ సమస్యతో సతమతమవుతుంది. ఇళ్లల్లోని మురుగు నీరు సీసీ రోడ్డు మార్జిన్ల ద్వారా చొచ్చుకొస్తుంది. పల్లపు ప్రాంతాలకు మురుగునీటి ప్రవాహంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. గ్రామంలోని పలు మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అభివృద్ధి పరిచారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో పలు సిమెంట్ రోడ్లు నిర్మించారు. గ్రామంలోని ప్రధాన రహదారి గుంతలు గుంతలు పడిపోయి అధ్వానంగా తయారవ్వడంతో దానిని తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. తారు రోడ్డు ప్రాంతంలో పలుచోట్ల మురుగునీరు చొచ్చుకురావడంతో రోడ్డు ఛిన్నాభిన్నమైపోతుంది. వర్షాకాలంలో సీసీ రోడ్లన్నీ మురుగునీటితో నిండిపోతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామం వెలుపల మురుగు నీటి ప్రవాహానికి డ్రెయినేజీ సౌకర్యం ఉన్నప్పటికీ వీధుల్లోని మురుగునీటి ప్రవాహానికి పక్కా డ్రెయిన్లు లేవు. వర్షాకాలంలో పలు చోట్ల కచ్చా డ్రెయిన్లు తవ్వి మురుగునీటి పారుదలకు అవకాశం కల్పిస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో మురుగునీటి ప్రవాహానికి అడ్డుతగిలే వ్యర్థాలను తొలగించే పారిశుద్ధ్య కార్మికులు అందుబాటులో లేకపోవడంతో తీవ్ర అవస్థలకు గురవుతున్నామని వాపోతున్నారు. దీంతో దోమలు విజృంభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు ప్రత్యేక శ్రద్ధ చూపించి డ్రెయిన్ సౌకర్యానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

భీమవరం డీసీసీ బ్యాంకులో సెమినార్

భీమవరం (ప్రకాశం చౌక్) :భీమవరం డీసీసీ బ్యాంకులో మంగళవారం భీమవరం డివిజన్ పరిధిలోని సహకార సంఘాలతో సీఈవో, సిబ్బందికి పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణపై సెమినార్ నిర్వహించారు. జిల్లా సహకార శాఖ అధికారి ఎం. నాగరాజు ఈ సెమినార్‌కు హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పలు అంశాలపై బ్యాంక్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఏలూరు డివిజన్ సహాయ అధికారి తిలక్, భీమవరం బ్రాంచ్ మేనేజర్ రెడ్డి నాయుడు పాల్గొన్నారు.

టెక్నాలజీని వినియోగించుకోవాలి


హ్యాకథాన్ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

భీమవరం: విద్యార్థులు టెక్నాలజీని వినియోగించుకోవాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజులు తెలిపారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రెండు రోజులు పాటు ప్రజ్వలన 2కె25 పేరిట జరిగిన హ్యాకథాన్ పోటీల్లో మొదటి స్థానం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్సీ విద్యార్థులు సాధించి రూ.20వేల నగదు బహుమతి అందుకున్నారు. హ్యాకథాన్ పోటీలు ముగింపు సందర్భంగా మంగళవారం సెమినార్ హాల్లో బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బి హెచ్ వి ఎస్ రామకృష్ణంరాజు, డాక్టర్ జి శిరీష ,డాక్టర్ కృష్ణంరాజు, కోఆర్డినేటర్ డి హేమలత మాట్లాడుతూ, రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు హర్యానా వంటి సుదూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి విద్యార్థులు హ్యాకథాన్ లో పాల్గొనడం జరిగిందని వివరించారు. ఎస్ఆర్‌కెఆర్‌లో ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయటం వలన విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని విజేతలైన పలువురు విద్యార్థులు పేర్కొన్నారు.

రీసర్వే పనులను వేగవంతం చేయాలి


రీ సర్వే పనులను పరిశీలిస్తున్న జేసీ

నరసాపురం రూరల్: భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం మొగల్తూరు మండలం కేపీ పాలెం గ్రామంలో రీ సర్వే పనులను ఆయన పరిశీలించారు. రైతుల భూములకు ఖచ్చితమైన హద్దులు గుర్తించి రికార్డులను ఆధునీకరించేందుకు ప్రయోగాత్మకంగా ఈ రీ సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్వే నిర్వహించే ముందు భూ యజమానులకు తెలియజేయాలని అన్నారు. రైతుల అభ్యంతరాలను ప్రామాణికంగా తీసుకుని సరిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు రైతులతో జేసీ మాట్లాడారు. జేసీ వెంట ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ రాజా కిషోర్, సర్వేయర్లు కుమార్, ధనరాజు, రీ సర్వే డీటీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

దళితవాడల అభివృద్ధికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నన్నేటి పుష్పరాజ్

భీమవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెలలు గడుస్తున్న దళితవాడలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి అభివృద్ధికి తోడ్పడాలని మాల మహానాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఈ సందర్భంగా పుష్పరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితవాడలో అభివృద్ధికి నోచుకోవడం లేదని, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు 100% పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేలా కూటమి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటి సుందర్ కుమార్, నేతల సువర్ణరాజు, చిల్లి రాజ్ కుమార్, కొలాటి ప్రసాదరావు, చిగురుపాటి రాజేష్, నేతల సాల్మన్ రాజు, పిట్టా వినోద్ కుమార్, దాసరి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పథకాలకు విశిష్ట సంఖ్య తప్పనిసరి


పెనుగొండలో యూనిక్ ఐడీ నమోదును పర్యవేక్షిస్తున్న జడ్ వెంకటేశ్వరరావు

పెనుగొండ: ప్రతి రైతూ యూనిక్ ఐడీ కోసం వివరాలు నమోదు చేసుకోవడం తప్పనిసరని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పెనుగొండ రైతు సేవాకేంద్రాల్లో రైతు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు పొందడానికి 11 అంకెలతో కూడిన యూనిక్ ఐడీ తప్పనిసరని అన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ ప్రియదర్శిని పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

నరసాపురం రూరల్: అవార్డులు, తెలుగు తేజం జాతీయ పురస్కారాలను అందుకున్న స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన డాక్టర్ వి.స్వామినాథన్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ విస్సా మాణిక్యాలరావులను మంగళవారం స్థానిక కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఇటీవల రాజమండ్రిలో పిలాం ట్రోఫిక్ ఆధ్వర్యంలో జరిగిన గోదావరి ఉత్సవ్ 2025 విభిన్న రంగాల్లోని తెలుగు తేజాలకు పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. డాక్టర్ అద్దంకి రాజా ప్రముఖ సామాజిక వేత్త చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో స్వామినాథన్, మాణిక్యాలరావులు పురస్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ వెంకటేశ్వరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

